సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 23 । జూన్ । 2024



అలుపెరుగని అథ్లెట్
రామకృష్ణాపూర్ పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన మడిపల్లి రాజకొమురయ్య అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఎన్నో పతకాలు సాధించాడు. 8లో▸



అవకతవకలకు పాల్పడితే చర్యలు
ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా అదనపు డీఆర్డీఓ దత్తారాం హెచ్చరించారు. జన్నారంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /26.0


వాతావరణం
ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తరం దిశగా ఈదురుగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

ప్రైవేటు బడి బాదుడే..!

జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల తమ పుస్తకాలన్నీ ఒకే బుక్‌స్టాల్‌లో అందుబాటులో ఉన్నాయని, ఆ పుస్తకాలతోపాటు నోట్‌బుక్‌లు సైతం అక్కడే కొనాలనే షరతు విధించింది. వీటితోపాటు యూనిఫాం, బెల్ట్, టై, షూ, సాక్స్‌లు సైతం స్కూల్‌తో ఒప్పందం ఉన్న షాపులోనే తీసుకోవాలనే మెలిక పెట్టారు. ఆ షాపు తప్ప వేరే చోట దొరికే పరిస్థితి లేకపోవడంతో ధరలు ప్రతీది ఎక్కువగానే ఉంటున్నాయి. ఆ షాపు నిర్వాహకులు, యాజమాన్యం మధ్య కమీషన్ ఒప్పందంతో విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు భారం పడుతోంది.

ఓ కార్పొరేట్ స్కూల్ తమ పుస్తకాలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపొందించామని చెబుతూ రూ.వేల కొద్దీ వసూలు చేస్తోంది. తమకు ఒప్పందం ఉన్న బుక్ షాపులోనే విక్రయిస్తోంది. పేరుకు ఎమ్మార్పీకే అమ్ముతున్నా ఆ ధరలే అధికంగా ఉన్నాయని తల్లిదండ్రులు అంటున్నారు. ఒక్కో పుస్తకం ధరపై కనీసం 20నుంచి 40శాతం వరకు కమీషన్ ఆ స్కూల్‌కు వెళ్తోంది.

- పుస్తకాల నుంచి విద్యార్థుల షూ, సాక్సుల వరకు
- యాజమాన్యాలు చెప్పిన చోటే కొనాలనే మెలిక
- ప్రతీ విక్రయంపై 20నుంచి 40శాతం కమీషన్
- తల్లిదండ్రులకు తప్పని అదనపు ఆర్థిక భారం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్లు పూర్తిగా వ్యాపార ధోరణి అవలంబిస్తున్నాయి. విద్యావ్యాపారం చేస్తున్న ఆ స్కూళ్లలో ఫీజులే కాకుండా పలు రకాలుగా సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. విద్యాసంవత్సరం ఆరంభం నుంచే అడ్మిషన్ల కోసం పోటీ పడ్డాయి. స్కూల్లో చేరాక విద్యార్థులకు యూనిఫాం నుంచి కాళ్లకు వేసుకునే షూ, సాక్సుల వరకు అన్నింటా డబ్బులు పిండుతూ తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ఇప్పటికే కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో నర్సరీ నుంచే ఫీజులు భారీగా పెంచాయి. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నతంగా చదివించాలనే బలహీనతను యాజమాన్యాలు సొమ్ముచేసుకుంటున్నాయి. కొన్ని స్కూళ్లు నిబంధనల మేర నడుచుకుంటున్నాయి.

చేతులేత్తేసిన విద్యాశాఖ

జిల్లా విద్యాశాఖ ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు, నిబంధనల అతిక్రమణపై కచ్చితంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేయడంతో నిర్వహణ అదుపు తప్పుతోంది. ప్రైవేటు స్కూళ్ల మధ్య పోటీతో స్టేట్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్, కరిక్యులం అంటూ ఆకర్షిస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల విద్యాసంస్థల ఫ్రాంచైజీల ఆధ్వర్యంలోనూ సాగుతున్నాయి. ఆయా విద్యాసంస్థల్లో ఫీజుల పట్టిక, సౌకర్యాలు, ప్రమాణాలపై విద్యాధికారులు తనిఖీ చేయాల్సి ఉన్నా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల ఎంఈవోలు ప్రైవేటు స్కూళ్లలో జరిగే వ్యవహారాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే విమర్శలున్నాయి. చాలా స్కూళ్లలో ఫిట్‌నెస్ లేకుండానే బడి బస్సులు, వ్యాన్లు రోడ్లపై తిరుగుతున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో పట్టుబడుతున్నాయి.

జిల్లాలో ప్రైవేటు స్కూళ్ల వివరాలు(గతేడాది)

సంస్థ	స్కూళ్లు	విద్యార్థులు
స్టేట్ సిలబస్	219	61,172
సీబీఎస్ఈ	02	1170
మొత్తం	221	62,342

'సర్కారు'లో అన్నీ ఫ్రీ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోపాటు యూనిఫాం, పుస్తకాలు ఉచితం. మధ్యాహ్న భోజన సదుపాయం ఉంది. బోధనపై నమ్మకం లేక తల్లిదండ్రులు ప్రైవేటుకే మొగ్గు చూపుతున్నారు. సర్కారు బడుల్లో చేరాలని ప్రచారం చేస్తున్నా స్పందన అంతంత మాత్రంగానే ఉంది. గురుకులాల్లో మాత్రమే స్పందన ఉంటోంది. జిల్లాలో స్థానిక, ప్రభుత్వ, గురుకులాలు, వసతి పాఠశాలలు, ఎయిడెడ్ స్కూళ్లు కలిపి మొత్తం 860 విద్యాసంస్థలు ఉన్నాయి. వీటిల్లో 61వేల మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూళ్లు 221 ఉండగా, వీటి పరిధిలోనే 62వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయితే ఈ సంఖ్య మరింత పెరగవచ్చు. కొన్ని ప్రైవేటు స్కూళ్లలో నర్సరీ అడ్మిషన్ కోసం పైరవీలు, సిఫారసు చేయాల్సి వస్తోంది. వాస్తవానికి ప్రైవేటులో కన్నా సర్కారు బడుల్లోనే శిక్షణ పొంది, అర్హతతో అధిక వేతనం పొందుతున్న ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రైవేటులో కనీసం బీఈడీ, టెట్ అర్హత లేని వారు సైతం బోధనలో ఉన్నారు. చాలా యాజమాన్యాలు టీచర్లకు నెలకు జీతం రూ.15 వేల నుంచి రూ.20వేలలోపే ఇస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు టీచర్ల మధ్య వేతనం, అర్హతలో పోలికే లేవు. కానీ ప్రైవేటులోనే మెరుగైన చదువు చెబుతారనే ఆశతో చాలామంది తల్లిదండ్రులు ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు.

భూసమస్యలకు పరిష్కారం!

- ఆరు గ్యారంటీలకు తొలి ప్రాధాన్యత
- సర్కారు భూములకు పూర్తి రక్షణ
- ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి
- 'సాక్షి'తో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన ఆరు గ్యారంటీలు అర్హులకు అందేలా చూస్తానని చెప్పారు. ప్రజావాణిలో వచ్చే అర్జీలు వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేలా పని చేస్తానని వివరించారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

శిక్షణ కలెక్టర్‌గా ఇక్కడ పని చేసి వెళ్లి.. మళ్లీ కలెక్టర్ హోదాలో వచ్చారు. జిల్లా అభివృద్ధి ఎలా కృషి చేస్తారు?

శిక్షణ కలెక్టర్‌గా ఇక్కడే పదిహేను నెలలు ఉన్నాను. మళ్లీ కలెక్టర్‌గా రావడంతో జిల్లాపై కొంత అవగాహన ఉంది. ఇక్కడి పరిస్థితులు తెలుసుకుంటూ ఆ మేరకు ముందుకు వెళ్తాను. అందరి సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తాను. పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తా.

జిల్లాలో అధికంగా భూ సమస్యలున్నాయి. ప్రతీవారం ప్రజావాణిలో అధికంగా అవే సమస్యలు వస్తున్నాయి. వీటిని ఎలా పరిష్కరిస్తారు?

ప్రస్తుతం జిల్లాలో 3వేల వరకు వివిధ రకాల అర్జీలు వచ్చాయి. వీటిలో వివాదం లేనివి వెనువెంటనే పరిష్కరిస్తున్నాం. రోజుకు 250నుంచి 300వరకు క్లియర్ చేస్తున్నాం. కుటుంబ, వారసత్వ, కోర్టు, అటవీ, సరిహద్దులు, హెచ్చుతగ్గుల వంటి వాటిపైనా దృష్టి పెట్టాం. కొన్ని చోట్ల పట్టాదారు, అనుభవదారుల మధ్య వివాదాలున్నాయి. కుటుంబ తగాదాల వంటివి చట్ట ప్రకారం నిర్ణయం తీసుకుంటాం. 'ధరణి'లో అందుబాటులోకి వచ్చిన మాడ్యూల్స్ ప్రకారం తహసీల్దార్లు, ఆర్డీవోల స్థాయిలో ఉన్న పెండింగ్‌వన్నీ పూర్తి చేయిస్తాం.

జిల్లా కేంద్రం, ముఖ్య పట్టణాల్లో సర్కారు భూములు కబ్జాకు గురవుతున్నాయి. వీటిని ఎలా కాపాడుతారు?

జిల్లా కేంద్రంతోపాటు పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జాకు గురికానివ్వం. త్వరలోనే వీటిపై పూర్తి కార్యాచర్యణ రూపొందించి కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం.

వానాకాలంలో మంచిర్యాల పట్టణంతోపాటు గోదావరి తీరం ప్రాంతాలు, పంటలు వరదలతో నీట మునుగుతున్నాయి. వీటిపై మీ కార్యాచరణ

మంచిర్యాల పట్టణంతోపాటు గోదావరి తీర ప్రాంతాల్లో వరదలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం. నదీ తీరాల్లో నిర్మాణాలు చేపట్టొద్దని చెబుతాం. ప్రాణహిత, గోదావరి తీరాల్లో పంట నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం.

కలెక్టర్‌గా పాలనలో మీ ప్రథమ ప్రాధాన్యతగా ఏ అంశాలు ఉండబోతున్నాయి?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా చూస్తాం. అలాగే ప్రజావాణిలో వచ్చే ప్రతీ దరఖాస్తు పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పరిపాలన సజావుగా సాగేలా చూస్తాం.

న్యూస్‌రీల్

పెండింగ్ కేసులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: కోర్టుల్లో ఐదేళ్ల పైబడి పెండింగ్ ఉన్న కేసులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రిమినల్ కేసులు, పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలేబుల్ వారెంటు కేసుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. జైలులో ఉన్న ఖైదీల కేసులపై సూచనలు చేశారు. కేసులు త్వరితగతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి, ఏసీపీ ప్రకాష్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్, లక్సెట్టిపేట జైలర్ స్వామి పాల్గొన్నారు.

గూడెంలో పౌర్ణమి జాతర


సత్యనారాయణ వ్రతాలు నోముతున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం జ్యేష్ఠ పౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. 169 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో శనివారం పాలిసెట్–2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. పాలిసెట్‌లో సాధించిన ర్యాంకు ప్రాతిపదికన స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు తొలిరోజు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని అధికారులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఆ తర్వాత పాలిటెక్నిక్ కళాశాలలు, కోర్సుల ప్రాధాన్యతను అధికారులు విద్యార్థులకు వివరించారు. తొలిరోజు కౌన్సెలింగ్‌కు 323 మంది విద్యార్థులు హాజరయ్యారని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి తెలిపారు.

రెండు బిల్లులపై అదనపు కలెక్టర్ ఆరా

సాక్షి స్పందన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 34వార్డుల్లో చేపట్టిన పనులకు సంబంధించి రెండు బిల్లులు చేయడంపై శనివారం 'సాక్షి'లో 'ఒకే నంబరుతో రెండు బిల్లులు' శీర్షికన ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. రెండేసి బిల్లులు ప్రతిపాదించడంపై జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ ఆరా తీశారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ సర్వర్ కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్‌కు రికార్డులు చూపించారు. వాహనాలకు బిల్లులు ఎంతవరకు చేశారని ఆయన అడిగి తెలుసుకున్నారు. రెండు బిల్లుల విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. మరోవైపు ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ కూడా అదనపు కలెక్టర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. సావధానంగా ఆలకించిన రాహుల్ తగిన సూచనలు చేసినట్లు తెలుస్తోంది. కాగా, కమిషనర్ పరిధిలో రూ.50వేలకు మించి బిల్లు చేయరాదనే నిబంధనలు ఉండగా.. సీఆర్ నంబరు 824లో రూ.58,650 బిల్లు ఏ ప్రాతిపదికన ప్రతిపాదించారనేది తేలాల్సి ఉంది. జేసీబీ వాహన యజమానికి రూ.44,850 బిల్లులు చేశామని చెబుతున్న అధికారులు రికార్డు చేయడంలో ద్వంద్వ విధానాలు అవలంబించడంపై విమర్శలు వస్తున్నాయి. జేసీబీతో ముందస్తుగా 51గంటలపాటు పనులు చేయించినట్లు రికార్డుచేసి తర్వాత 39గంటలకు కుదించడం గమనార్హం. సీఆర్ నంబరు 823లో బ్లేడ్ ట్రాక్టర్‌తో 58గంటలు పని చేయించి రూ.46,400తో ఓ బిల్లు రికార్డు చేశారు. అదే సీఆర్ నంబరుతో తయారు చేసిన మరో బిల్లులో పని గంటలు 48గంటలకు కుదించి రూ.38,400 బిల్లు తయారు చేశారు. పని గంటలు, బిల్లుల రికార్డులో తేడాలు ఉండగా అసలు ఎన్ని పని గంటలు అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సరెండర్, బిల్లుకు సంబంధం లేదు

బిల్లులు రెండేసి తయారు చేయలేదని, ఒక బిల్లు ప్రతిపాదించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. బిల్లుల చెల్లింపు మూడు నెలల క్రితం జరగగా, సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తాజాగా ప్రభుత్వానికి సరెండర్ చేయడానికి సంబంధం లేదని పేర్కొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా మహిళా శక్తి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


మాట్లాడుతున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా మహిళా శక్తి ద్వారా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్‌తో కలిసి జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, ఏపీఎంలతో మహిళా శక్తి పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా అనేక అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మహిళా శక్తి పథకంలో మైక్రో ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో 5,684 మందికి రూ.64.73కోట్లు, స్టిచ్చింగ్ సెంటర్ల విభాగంలో 618 మందికి రూ.2.35కోట్లు, పాడిపశువుల విభాగంలో 500 మందికి రూ.4.50కోట్లు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ విభాగంలో 2 వేల మందికి రూ.3 కోట్లు, పౌల్ట్రీ మదర్ యూనిట్ల విభాగంలో 16 మందికి రూ.46 లక్షలు, మొబైల్ ఫిషర్ రిటైల్ ఫిషరీ రిటైల్ ఔట్‌లెట్ విభాగంలో ఐదుగురికి రూ.10 లక్షలు, మిల్క్ పార్లర్ల విభాగంలో ఒక్కరికి రూ.1.90లక్షలు, ఎంసీఎంఎస్‌సీ(మీ సేవ) విభాగంలో 20 మందికి రూ.50 లక్షలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ విభాగంలో 21 మందికి రూ.31లక్షలు, ఎంఎస్ క్యాంటీన్ల విభాగంలో 40 మందికి రూ.కోటి, ప్లాస్టిక్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ యూనిట్ విభాగంలో 10 మందికి రూ.8 లక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల విభాగంలో 200 మందికి రూ.4 కోట్లకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని 16 మండలాల్లో నిర్దేశించిన ప్రకారం లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణకు గడ్డిజాతి మొక్కల పెంపకం


విత్తనాలు చల్లుతున్న అధికారులు

కోటపల్లి: వన్యప్రాణుల సంరక్షణకు గడ్డిజాతి మొక్కల పెంపకం చేపడుతున్నట్లు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి తెలిపారు. ఏరువాక పౌర్ణమి, ప్రపంచ రెయిన్ ఫారెస్టు డేను పురస్కరించుకుని అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బమన్‌పల్లి నీలగిరి ప్లాంటేషన్ ఖాళీ ప్రదేశాల్లో పచ్చిక మైదానాల కోసం ఐసోలిమా గడ్డి జాతి గింజలు చల్లే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ మేనేజర్ శ్రావణి మాట్లాడుతూ పచ్చిక కొరవడడంతో కుందేళ్లు, జింకలు, వన్యప్రాణులు అంతరిస్తున్నాయని, కొన్ని చోట్ల పంటలకు వేసిన రసాయనాలు తిని మరణిస్తున్నాయని తెలిపారు. అందుకోసం అటవీప్రాంతాల్లో సహజసిద్ధంగా పచ్చిక మైదానాలు పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ రేంజ్‌ల ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్, లక్ష్మణ్, సునీత, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్లు రాకేష్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో నాకాబందీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో శనివారం రాత్రి హాజీపూర్ పోలీసుల ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. మండలంలోని జాతీయ రహదారిపై నిర్వహించిన విస్తృత తనిఖీల్లో భాగంగా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బీమా, నంబరు ప్లేట్ లేని వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. రోడ్డు భద్రతలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కూడా కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని, వాహనాలు ఇస్తే కేసులు తప్పవని హాజీపూర్ ఎస్సై సురేశ్ తెలిపారు.

రుణ విముక్తులను చేయడమే లక్ష్యం

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, రైతులు

పాతమంచిర్యాల: రైతులను రుణవిముక్తులను చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రకటన నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే నివాసంలో రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా వరంగల్‌లో రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తోందని అన్నారు. నిజమైన రైతులకు రైతుభరోసా, రుణ మాఫీ వర్తించేలా ప్రభుత్వం నిర్ణయిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా ఖజానా ఖాళీ చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు సకాలంలో ఇస్తున్నామని అన్నారు. 20ఏళ్లుగా మంచిర్యాల పట్టణవాసులు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోలేదని, వారు పరిష్కరించలేని సమస్యలు తాము పరిష్కరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు


హాజీపూర్ మండలం కొండాపూర్‌లో కాడెడ్లతో అచ్చు వేస్తున్న రైతు


పెద్దంపేటలో నారుమడికి విత్తనాలు సిద్ధం చేస్తున్న రైతు


నెన్నెలలో విత్తనాలు వేస్తున్న రైతులు

- చల్లబడిన వాతావరణం
- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- చేను బాట పట్టిన రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ప్రారంభమైనా కొద్ది రోజులుగా జిల్లాలో ఎండలు మండుతుండగా.. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో శుక్రవారం 5.2 మిల్లీమీటర్లు, శనివారం 9.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు పొలాల బాట పట్టారు. చల్లబడిన వాతావరణంతో సాధారణ ప్రజలు కూడా ఊరట చెందుతున్నారు. మొన్నటి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైగా నమోదు కావడం, ఎండ వేడిమి ఉక్కపోతతో అల్లాడిపోయారు. రుతు పవనాలు జిల్లాను తాకినా వర్షాలు లేకపోవడం, విత్తనాలు వేసుకునేందుకు సిద్ధమైనా దుక్కి రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఎండ తీవ్రత తగ్గి మబ్బులు కమ్ముకుని కురుస్తున్న వర్షాలతో అరక పట్టి దుక్కులు దున్నుతూ విత్తనాలు వేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు మొన్నటి వరకు వర్షాలు లేక ఆందోళన చెందారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసి జలాశయాల్లోకి నీరు చేరితే గానీ వరి సాగు చేసే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. మరో రెండు రోజులు వర్ష సూచన ఉండడంతో రైతులు ఆశతో విత్తనాలు వేస్తున్నారు.

జిల్లాలో నమోదైన వర్షం..

జైపూర్ మండలంలో 33.2 మిల్లీమీటర్లు, చెన్నూర్‌లో 17.9, లక్సెట్టిపేటలో 16.4, నస్పూర్‌లో 15.3, హాజీపూర్‌లో 13.8, బెల్లంపల్లిలో 10.5, భీమారంలో 10.6, జన్నారంలో 9.2, మంచిర్యాలలో 9, భీమినిలో 8.2, మందమర్రిలో 7.3, కోటపల్లిలో 5, దండేపల్లిలో 4.3, కాసిపేటలో 4.2, కన్నెపెల్లిలో 2.9, నెన్నెలలో 2.9, తాండూర్‌లో 1.6, వేమనపల్లిలో 0.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సగటున 113.8 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా 40.1 మిల్లీమీటర్లు కురిసింది. 65శాతం లోటు నెలకొంది. 12 మండలాల్లో అత్యధిక లోటు, 6 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది.

కర్షకులు బిజీ బిజీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తొలకరి వానలతో కర్షకులు బిజీ బిజీగా మారారు. ఉదయాన్నే చేలకు వెళ్లి పొడి దుక్కులు దున్నుతున్నారు. హాజీపూర్ మండలం కొండాపూర్, పెద్దంపేట తదితర గ్రామాల్లో నారుమడి కోసం మొలకలు అలకడం, జనుములు, పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం, నారుమడి దుక్కిదున్నడం, వ్యవసాయ పనిముట్ల తయారీలో నిమగ్నమయ్యారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

వేమనపల్లి: ఈ నెల 19న అర్ధరాత్రి దస్నాపూర్ శివారులోని తాటివనం వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. పక్కా సమాచారంతో పేకాట స్థావరంపై దాడిచేయగా పారిపోయిన 15 మందిని శనివారం అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి మళ్లీ పేకాట ఆడకుండా ఉండేలా తహసీల్దార్ రమేశ్ ఎదుట లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేశామన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

జన్నారం: జన్నారం గ్రామ పంచాయతీ పరిధిలో ఆస్తి తగాదాల్లో దాడి చేసిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. జన్నారం గ్రామ పంచాయతీకి చెందిన ముజీబొద్దీన్, అతని సోదరుడు ఫహీమొద్దీన్ శుక్రవారం రాత్రి ఆస్తి విషయంలో గొడవ పడ్డారు. ముజీబొద్దీన్, ఎజాస్ ఇద్దరూ కలిసి ఫహిమోద్దీన్‌ను అతని భార్యపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


ఆత్రం గణేశ్(ఫైల్)

తిర్యాణి: గుర్తు తెలియని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గుండాల గ్రామానికి చెందిన ఆత్రం గణేశ్ (20) కొంతకాలంగా దండెపెల్లి మండలం కర్ణపేట గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఈనెల 21న గ్రామ శివారులోని మామిడి తోట లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్సకోసం వరంగల్‌లోని ఎంజీఎంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. దండెపెల్లి పోలీసులను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

జేసీబీ బకెట్ తాకి కూలీ మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేకే-1 గని ఫ్యాన్ సమీపంలో జేసీబీ బకెట్ తాకి నైతం నవీన్ (35) అనే వలస కూలీ మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కొమురంభీం జిల్లా బెజ్జూర్ మండలానికి చెందిన నవీన్ రామకృష్ణాపూర్ రోడ్డు పక్కన గల రాజేశం అనే ఇటుకల తయారీ వ్యాపారి వద్ద పనికి కుదిరాడు. శనివారం కేకే-1 ఏరియాలోని అటవీ ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మాణ పనుల కోసం ట్రాక్టర్‌లో ఇసుక తీసుకెళ్తుండగా గోతిలో దిగబడింది. ట్రాక్టర్‌ను బయటకు తీయడానికి జేసీబీని తీసుకెళ్లారు. డ్రైవర్ జేసీబీని వెనక్కి తీస్తుండగా అక్కడే ఉన్న నవీన్‌కు చాతిలో బకెట్ బలంగా తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేసీబీ డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


వేమనపల్లి: బుయ్యారంలో నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్, ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ సమ్మయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య బృందంతో కలిసి గ్రామాల్లో సోదాలు నిర్వహించారు. నెమలికొండ శ్రీనివాస్ ఇంటి వెనుకాల తనిఖీలు చేపడుతుండగా అతని బంధువు సంతోష్ సీఐని దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించాడు. సీఐ ఫిర్యాదు మేరకు సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సుమారు 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు.

అలుపెరుగని అథ్లెట్..!

> అతను సింగరేణి మాజీ కార్మికుడు. సంస్థలో జనరల్ మజ్దూర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. ఉద్యోగ రీత్యా రిటైర్డ్ అయినా శారీరక దృఢత్వంతో వృద్ధాప్యానికి సవాల్ విసురుతున్న అలుపెరుగని అథ్లెట్ ఆయన. అంతే కాదు యోగాలో కూడా జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చి పలు బహుమతులు, అవార్డులు సొంతం చేసుకున్న విజేయుడు. అతనే రామకృష్ణాపూర్‌లోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన మడిపల్లి రాజకొమురయ్య. అటు అథ్లెట్‌గా యోగా గురువుగా పలువురి ప్రశంసలు అందుకుంటున్న రాజకొమురయ్య ఇప్పుడు అందరి నోళ్లలో నానుతున్నారు. ఇల్లు.. లేదంటే స్టేడియమే నిలయాలుగా సాధన చేస్తున్న రాజకొమురయ్యపై ప్రత్యేక కథనం.

- యోగాలోనూ జాతీయ స్థాయిలో ప్రతిభ
- పలు అవార్డులు సొంతం చేసుకున్న రాజకొమురయ్య
- ఇంట్లో ధ్యానం..స్టేడియంలో కసరత్తు ఆయన దినచర్య


బహుమతి అందుకుంటున్న రాజకొమురయ్య (ఫైల్)


యోగా సాధన చేస్తున్న రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాకు చెందిన మడిపల్లి రాజకొమురయ్య సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహించేవాడు. జనరల్ మజ్దూర్‌గా పనిచేసిన ఆయన మందమర్రి ఏరియాలోని కేకే5 గనిలో 2019లో ఉద్యోగ విరమణ పొందాడు. రిటైర్ అయ్యాడన్న మాటేగానీ ఇప్పటికీ నిత్య యువకుడిగానే దర్శనమిస్తాడు. ప్రతీరోజు క్రమం తప్పకుండా స్టేడియానికి రావటం ఆనవాయితీగా పెట్టుకున్నాడు. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తూ శారీరక ధృఢత్వంతో ముందుకు పోతున్నారు. వెటరన్ ఆటగాడిగా పోటీల్లో పాల్గొంటూ అథ్లెట్‌గా రాణిస్తున్నాడు. 60 ఏళ్లకు పైబడిన వారికి నిర్వహించే అథ్లెటిక్ పోటీల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు.

సాధించిన బహుమతులు

- 2011లో వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ తమిళనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 50 ఏళ్ల విభాగంలో 5000 మీటర్ల వాక్‌లో ప్రథమ బహుమతి సాధించాడు.
- అదే సంవత్సరం వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ పుదుచ్చేరి వారు నిర్వహించిన 31వ వెటరన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 50 ఏళ్ల వయసు విభాగం 5000 మీటర్ల వాక్‌లో ద్వితీయ బహుమతి సాధించాడు.
- 2016లో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 400 మీటర్ల పరుగులో ప్రథమ బహుమతి సాధించాడు.
- 2018లో యోగా ప్రచార సమితి, తెలంగాణ వారు హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ద్వితీయ బహుమతి సాధించాడు.
- 2019లో ఉస్మానియా యూనివర్శిటీలో నిర్వహించిన మొదటి అథ్లెటిక్ ఓపెన్‌మీట్‌లో 60 ఏళ్ల వయసు విభాగంలో 400 మీటర్ల పరుగులో ప్రథమ బహుమతి, అదే ఏడాది హెల్దీ సీనియర్ సిటిజన్స్ వారు హైదరాబాద్‌లో నిర్వహించిన 3000 మీటర్ల వాక్‌లో ప్రథమ బహుమతి సాధించాడు.
- 2020లో మందమర్రిలో నిర్వహించిన నేషనల్ లెవల్ యోగా ఛాంపియన్ షిప్ పోటీల్లో 61 ఏళ్ల వయసు విభాగంలో ద్వితీయ బహుమతి, 2022లో ఇండియన్ యోగా స్కూల్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు.
- 2023లో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన 4వ ఆలిండియా కాన్ఫరెన్స్‌లో బెస్ట్ యోగా మాస్టర్ అవార్డు అందుకున్నాడు.
- అదే ఏడాది బహుజన రైటర్స్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో క్రీడారత్న జాతీయ అవార్డు అందుకున్నాడు.
- ఇటీవల పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మొదటి ఫెడరేషన్ కప్ పోటీల్లో 65 ఏళ్ల వయసు విభాగంలో 3 కిలోమీటర్ల వాక్‌లో ద్వితీయ బహుమతి సాధించాడు.

ఆరోగ్యమే మహాభాగ్యం...

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న నానుడిని పరమావధిగా భావించే రాజకొమురయ్య యోగా వైపు కూడా దృష్టిసారించాడు. ప్రతీరోజు యోగాసనాలు అలవాటు చేసుకుని నేడు మంచి యోగా మాస్టర్‌గా కూడా ఎదిగాడు. యోగా విన్యాసాలతో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. రోజురోజుకు చురుగ్గా తన ప్రతిభా పాటవాలకు పదును పెడుతూ రెండు రంగాల్లోనూ విశేష అనుభవాన్ని సొంతం చేసుకున్నాడు. మాజీ సింగరేణి కార్మికుడి కంటే మంచి అథ్లెట్‌గా, యోగా రాజకొమురయ్య అంటేనే ఇప్పుడు తెలిసే స్థాయికి ఎదిగాడు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కౌటాల: సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైస్‌మిల్లు సమీపంలో శనివారం అనుమానాస్పదంగా ఒకరు మృతి చెందినట్లు ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం వజనపల్లికి చెందిన కొడెపాక వెంకటేశ్ (34) ఐదేళ్లుగా భార్యా పిల్లలతో కలిసి అత్తగారి ఊరైన మహారాష్ట్రలోని సిరోంచ మండలం కోటపోచంపల్లిలో ఉంటున్నాడు. టేకు కలప కొనుగోలు చేసి మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి కాగజ్‌నగర్ మీదుగా కోటపోచంపల్లికి బొలెరో వాహనంలో తరలిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం వేకువ జామున నిద్రపోవడానికి సిర్పూర్(టి) మండల కేంద్రానికి సమీపంలోని రైస్‌మిల్లు వద్ద కాగజ్‌నగర్- సిర్పూర్(టి) ప్రధాన రహదారి పక్కన వాహనం నిలిపి డ్రైవర్‌తో పాటు వెంకటేశ్, మరొకరు పడుకున్నారు. ఉదయం పెట్రోలింగ్ పోలీసులు వాహనం వద్ద కింద పడి మృతి చెందిన వెంకటేశ్‌ను గుర్తించారు. నిద్రమత్తులో బొలెరో వాహనం నుంచి పడి వెంకటేశ్ మృతి చెందాడా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని కౌటాల సర్కిల్ సీఐ సాధిక్‌పాషా, ఎస్సై దీకొండ రమేశ్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుని సోదరుడు కోడెపాక మల్లేశ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

'24న ధర్నా విజయవంతం చేయాలి'

జన్నారం: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 24న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతామహాలక్ష్మి కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు.


మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, సభ్యులు శైలజ, పద్మ, లక్ష్మి, కృప, రాజవ్వ, ఏసుమణి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, స్టోన్‌బస్ట్ తరలిస్తున్న లారీల పట్టివేత

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పుంజుమేరగూడ బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ పంపు వద్ద అక్రమంగా ఇసుక, స్టోన్‌బస్ట్ తరలిస్తున్న లారీలను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ గంగాధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి రెబ్బెనలో కాపు కాయగా పెట్రోల్ పంపు వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టుబడినట్లు తెలిపారు. లారీని స్వాధీనం చేసుకుని రెబ్బెన పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అదే సమయంలో కరీంనగర్ నుండి ఆసిఫాబాద్ వైపు స్టోన్‌బస్ట్ తరలిస్తున్న లారీని తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆ లారీని సైతం స్వాధీనం చేసుకుని


పట్టుకున్న లారీతో మైనింగ్ ఏడీ గంగాధర్

పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న లారీకి రూ. 74,000, స్టోన్‌బస్ట్‌తో పట్టుబడిన లారీకి రూ.7,020ల జరిమానా విధించి వాహనాలను రిలీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

కార్మికులు ఉద్యోగాలు కాపాడుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు తమ ఉద్యోగాలు కాపాడుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఎస్సార్పీ1, ఎస్సార్పీ3, 3ఏ గనుల్లో గైరాజరైన కార్మికులకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంవత్సరంలో నిర్ణీత మస్టర్లు చేయకుంటే ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సింగరేణిలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఉన్న ఉద్యోగాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. 116 మంది గైర్హాజరు కార్మికులకు ఈ సందర్భంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు, అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్‌బాబు, అధికారులు పాలకుర్తి రాజు, గౌస్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

కర్ర అవశేష శిలాజాలు పరిశీలన

తిర్యాణి: మండలంలోని గిన్నెదరి రేంజ్ పరిధిలోని పంగిడిమాదర బీట్‌లో శనివారం అటవీ శాఖ ఉన్నతాధికారులు, జియోలజిస్టులు పర్యటించి కర్ర అవశేష శిలాజాలు, నత్త అవశేష శిలాజాలు పరిశీలించారు.


పరిశీలిస్తున్న అధికారులు

వాటితో పాటు వివిధ రకాల చెట్లు, ఆర్కిడ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంగిడిమాదర బీట్‌ను జీవ వైవిధ్య ప్రాంతంగా గుర్తిస్తామన్నారు. ఫారెస్టు శాఖ ఎఫ్‌డీపీటీ శాంతారాం, సీనియార్ జియాలాజిస్ట్ చక్రవర్తి, ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, గిన్నెదరి రెంజర్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల టీఎన్జీవోస్ సభ్యులు శనివారం కేంద్ర హోంశాఖ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాతో


సన్మానిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి అనుముల సతీశ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

చంపి బావిలో పడేశారు..

- మహిళతో ఏర్పడిన సాన్నిహిత్యమే కారణం
- రెండు నెలల తర్వాత వెలుగులోకి..
- వీడిన మానకొండూర్ యువకుడి అదృశ్యం మిస్టరీ


అనంతోజు సాయికిరణ్ (ఫైల్)

దహెగాం: ఇద్దరి మధ్య ఏర్పడిన సాన్నిహిత్యం ఓ యువకుడి హత్యకు దారి తీసింది. సదరు మహిళను కలవడానికి వచ్చిన యువకుడిని ఆమెతోపాటు బంధువులు కొట్టి చంపి బావిలో పడేశారు. తన భర్త కనిపించడం లేదని అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చేపట్టిన విచారణలో విషయం వెలుగుచూసింది. రెండు నెలల తర్వాత కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన యువకుడి అదృశ్యం మిస్టరీ వీడింది. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం బారెగూడెం గ్రామానికి చెందిన బట్టే శ్రీనివాస్, సునీత దంపతులు సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్‌లోని ఓ కోళ్లఫారంలో పని చేస్తుండేవారు. అదే కోళ్లఫారంలో మానకొండూరుకు చెందిన అనంతోజు సాయికిరణ్, అనూష దంపతులు కూడా నాలుగేళ్లుగా పని చేసేవారు. ఈ క్రమంలో సునీతతో సాయికిరణ్‌కు సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ విషయంలో సునీత భర్త శ్రీనివాస్‌తో గొడవలు జరిగాయి. దీంతో సాయికిరణ్ తన భార్యతో మానకొండూరుకు వచ్చి కట్టెకోత మిషన్‌లో పని చేస్తున్నాడు. ఏప్రిల్ 18న సాయికిరణ్ సిద్దిపేటకు వెళ్తున్నానని తన భార్యకు చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య అనూష మే 2న మానకొండూరు పోలీసుస్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. అదృశ్యంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కొండాపూర్ నుంచి సునీత, శ్రీనివాసులు ఏప్రిల్ 18న సునీత తల్లిగారు ఊరు కుమురంభీం జిల్లా దహెగాంకు వచ్చారు. అదే నెల 19న సునీత కోసం సాయికిరణ్(29) దహెగాంకు రాగా ఆ రోజు రాత్రి సునీత, ఆమె భర్త, తండ్రితోపాటు మేనమామ కలిసి కర్రలతో కొట్టి చంపి పాడుబడ్డ బావిలో పడేశారు. పోలీసుల విచారణలో ఈ విషయం వెలుగు చూడడంతో బావిలో కుళ్లిపోయిన సాయికిరణ్ మృతదేహాన్ని శనివారం బయటకు తీశారు. నిందితులు నలుగురిపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు. సీఐ వెంట దహెగాం ఎస్సై రాజు ఉన్నారు.


బావిలో నుంచి మృతదేహాన్ని తీస్తున్న దృశ్యం

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.ప్రవీణ్‌కుమార్, కోచ్‌లు ఎం.నాగలక్ష్మి, ఎం.సరీష్ తెలిపారు. ఎండి ఆఫ్రీన్, సీహెచ్.ప్రాన్సిస్, ఎస్.అవినాశ్, జి.మణిప్రియ, కే.ప్రవస్తి, ఎం.సాయి వెంకట్, అశ్రీత్, ఎం.సాయి అద్వేత, వి.షణ్ముక్, సీహెచ్.సమన్వి, ఎండీ అస్మా, ఎన్.మానివి బ్లాక్‌బెల్ట్, రెడ్‌బెల్టులు సాధించినట్లు వారు పేర్కొన్నారు.

'రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి'

పాతమంచిర్యాల: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు 18 రాష్ట్రాలలో ఎస్సీ జాబితాలో ఉండగా 11 రాష్ట్రాలలో అందుకు భిన్నంగా ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విధంగా లోక్ సభలో బిల్లు ఆమోదించాలన్నారు. సమావేశంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగెళ్లపల్లి తిరుపతి, యూత్ గౌరవ అధ్యక్షుడు సంగెపు ఎలయ్య, జిల్లా అధ్యక్షుడు సంగెపు లక్ష్మణ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కంచెర్ల కొమురయ్య, కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు రమేశ్, పట్టణ కార్యదర్శి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అర్హతపత్రం అందజేయాలి

మంచిర్యాలఅర్బన్: ఈ విద్యాసంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయించేందుకు అర్హత పత్రాలు అందజేయాలని డీఈవో యాదయ్య తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన క్వాటర్లీ రిటర్న్ టాక్సీ (కమర్షియల్‌టాక్సీ), ఆడిట్ రిపోర్టులతో రూ.2వేలు డీడీ డీఈవో, మంచిర్యాల పేరిట డిపాజిట్ చెల్లించి ఈనెల 24 నుంచి 28 లోపు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆందోళన బాటలో 'ఆదర్శ' ఉపాధ్యాయులు

కుంటాల: ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ నెల 24 నుంచి 29 వరకు ఆందోళనల బాట పట్టనున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం రోజుకో రీతిన నిరసనలు తెలుపనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఉండగా అందులో సుమారు 160 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

డిమాండ్లు ఇవే..

- బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.
- 010 పద్దు ద్వారా వేతనం చెల్లించాలి.
- హెల్త్ కార్డులు జారీ చేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి.
- కారుణ్య నియామకాలు చేపట్టాలి.

నిరసన కార్యక్రమాలు

- ఈ నెల 24న నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు.
- 25, 26 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసనతో పాటు సీఎంవో విద్యాశాఖ కార్యదర్శికి ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం.
- 27న తహసీల్దార్, మండల విద్యాధికారులకు వినపత్రాలు అందజేత.
- 28న కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, 29న పాఠశాల విద్యాశాఖ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.



కుంటాలలోని ఆదర్శ పాఠశాల

సమస్యలు పరిష్కరించాలి



ఆదర్శ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కొన్నేళ్లుగా కోరుతున్నాం. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24 నుంచి 27వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. అయినా స్పందించనిపక్షంలో ధర్నాకు పూనుకుంటాం.

– సందుక్వర్ ప్రవీణ్ కుమార్, మోడల్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

జన్నారం: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని మంచిర్యాల అదనపు డీఆర్డీవో దత్తారాం అన్నారు. గత ఆర్థిక సంవత్సరం 330 పనుల కోసం 5 కోట్ల 48 లక్షల 80 వేల 925 రూపాయలు వేతనాల రూపేణా, 14 లక్షల 94 వేల 980 రూపాయలు సామగ్రి రూపేణా ఖర్చు చేశారు. ఉపాధి హామి పనులపై ఈ నెల 9 నుంచి 21 వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ సరోజన అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. మంచిర్యాల అదనపు డీఆర్డీవో హాజరయ్యారు. పలు గ్రామాల రికార్డుల్లో పనుల వివరాలు లేకపోవడం, మరి కొన్ని గ్రామాల్లో నాటిన మొక్కలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కలమడుగు, రేండ్లగూడ, మొర్రిగూడ, జన్నారం, కొత్తపేట, మల్యాల గ్రామాలు మినహా మిగతా 23 గ్రామాలలో జరిగిన పనులకు కలిపి రూ.84,500 రికవరీకి ఆదేశించారు. ఎనిమిది గ్రామాల్లో రికార్డుల్లో నమోదు కాని రూ.13 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, అంబుడ్స్ అధికారి శివరాం, ఎంపీవో రమేశ్, ఏపీవో రవీందర్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కిరణ్, సామాజిక తనిఖీ బృందం, కార్యదర్శులు పాల్గొన్నారు.


సిబ్బందిని ప్రశ్నిస్తున్న అదనపు డీఆర్డీవో దత్తారాం